92 మంది హాజరు..

మూసాపేట: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రూప్‌ 1 పరీక్షలు శుక్రవారం 5వ రోజు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 118 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 92 మంది హాజరయ్యారు. మరో రెండు రోజుల పాటు ఈ పరీక్షలు జరగనున్నాయి.

నేడు విద్యుత్‌ సమస్యల పరిష్కార వేదిక

చందానగర్‌: విద్యుత్‌ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక శనివారం చందానగర్‌ సబ్‌ డివిజన్‌ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు గచ్చిబౌలి విద్యుత్‌ డివిజనల్‌ ఇంజినీర్‌ యాదగిరి, చందానగర్‌ ఏడీఈ, ఏఈలు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ పరిష్కార వేదికలో దీర్ఘకాలంగా ఉన్న విద్యుత్‌ సమస్యలు, విద్యుత్‌ బిల్లుల హెచ్చు తగ్గులు తదితర సమస్యలను వినియోగదారులు పరిష్కరించుకోవచ్చన్నారు. విద్యుత్‌ వినియోగదారులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైద్యులకు సన్మానం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని రాందేవ్‌రావ్‌ ఆసుపత్రి, రోటరీ క్లబ్‌ ఆఫ్‌ గ్రేటర్‌ హైదరాబాద్‌ సంయుక్తంగా 2008 నుంచి నేటి వరకు నిరంతరాయంగా పల్స్‌ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. శుక్రవారం ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్‌ ఆఫ్‌ గ్రేటర్‌ హైదరాబాద్‌ ఆధ్వర్యంలో పోలియో నిర్మూలన కోసం విశేషంగా కృషి చేసిన రాందేవ్‌రావ్‌ హాస్పిటల్‌ కూకట్‌పల్లి సీఈఓ డాక్టర్‌ యోబు, డాక్టర్‌ ప్రసాద్‌రావులకు జ్ఞాపికను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్‌ ఆఫ్‌ గ్రేటర్‌ హైదరాబాద్‌ అధ్యక్షులు కె. శ్రీనివాసరావు, సెక్రటరీ డి.శివరామకృష్ణారావు, రవీంద్ర, శివశంకరరావు, ఆర్‌ మురళీకృష్ణ, జయప్రకాష్‌ నంబూరు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఓపెన్‌ హౌజ్‌లో జాగిలాల ప్రదర్శన



సైబరాబాద్‌ కమిషనరేట్‌లో ఓపెన్‌ హౌజ్‌లో గన్‌ల గురించి విద్యార్థులకు వివరిస్తున్న పోలీసులు

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం

సైబరాబాద్‌ విమెన్‌ అండ్‌ చైల్డ్‌ సేఫ్టీవింగ్‌ డీసీపీ సృజన

- సైబరాబాద్‌ కమిషనరేట్‌లో ఆకట్టుకున్న 'ఓపెన్‌ హౌజ్‌'
- పాల్గొన్న 1200 మంది విద్యార్థులు





రాయదుర్గం: పోలీసులు సమాజంలో శాంతిభద్రతలను కాపాడడంలో కీలకపాత్ర పోషిస్తారని సైబరాబాద్‌ విమెన్‌ అండ్‌ చైల్డ్‌ సేఫ్టీ వింగ్‌ డీసీపీ సృజన పేర్కొన్నారు. సైబరాబాద్‌ కమిషనరేట్‌లో శుక్రవారం ఓపెన్‌ హౌజ్‌ను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే విజయం సాధించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పోలీస్‌స్టేషన్‌ గురించి , పనిచేసే విధానం గురించి విద్యార్థులకు వివరించారు. ఏడాదికో సారి ఓపెన్‌హౌజ్‌ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఆయుధాలు, పోలీసు వ్యవస్థ గురించి తెలుసుకోవచ్చన్నారు. అనంతరం పోలీసు ఆయుధ సంపత్తిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పలు పాఠశాలలు, కళాశాలల నుంచి వందల సంఖ్యలో విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. ఇందులో ఆయుధాలు, జాగిలాలు, గుర్రాలను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. మెషిన్‌గన్స్‌, అధునాతన రైఫిల్స్‌, బాంబును గుర్తించే పరికరాల పనితీరు గురించి తెలుసుకున్నారు. ముఖ్యంగా బాంబు డిస్పోజల్‌ బృందం పరికరాలను ప్రదర్శించగా, స్నిఫర్‌ డాగ్‌లు తమ సామర్థ్యాన్ని ప్రదర్శించాయి. వాసన ద్వారా పేలుడు పదార్థాలను ఎలా గుర్తిస్తాయో శిక్షకులు చూపించారు. కార్యక్రమంలో మౌంటెడ్‌ పోలీసుల గుర్రపు స్వారీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సీఏఆర్‌ హెడ్‌క్వార్టర్స్‌ ఏడీసీపీ షమీర్‌, ఏసీపీలు ప్రసన్నకుమార్‌, నాగసాయి, అరుణ్‌కుమార్‌, ఇంద్రవదన్‌, ఇన్‌స్పెక్టర్‌ సునీత, యాంటీ హ్యూమన్‌ ట్రాఫికింగ్‌ యూనిట్‌ ఇన్‌స్పెక్టర్‌ జేమ్స్‌బాబు, భరోసా ఇన్‌స్పెక్టర్‌ ప్రతాప్‌లింగం , ఆర్‌ఐ హనిమిరెడ్డి, వీరారెడ్డి, బాంబ్‌ డిస్పోజల్‌ టీమ్‌ ఆర్‌ఐ గణేష్‌, కృష్ణ, ఎంటీఓ వీరలింగం, పోలీసు బృందం పాల్గొంది.


సైబరాబాద్‌ కమిషనరేట్‌లో ఓపెన్‌ హౌజ్‌లో పాల్గొన్న బృందం


ఓపెన్‌ హౌజ్‌ను తిలకిస్తున్న విద్యార్థుల బృందం

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

మియాపూర్‌ : గోకరాజు రంగరాజు, రాంనరేష్‌ నగర్‌, కేంద్రీయ విహార్‌ గౌతమినగర్‌ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ హరీష్‌సింగ్‌ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటల నుండి 11 గంటల వరకు గౌతమీనగర్‌ ఫీడర్‌ పరిధిలోని శ్రీనివాసకాలనీ, గౌతమీనగర్‌ లేక్‌వ్యూ కాలనీ, శుభోదయ కాలనీ, 11.30 గంటల నుండి 1 గంట వరకు మిత్రహిల్స్‌, ఏఎస్‌ రాజునగర్‌, ప్రశాంత్‌నగర్‌, వర్టెక్స్‌ అపార్ట్‌మెంట్‌, మధ్యాహ్నం 1.30 నుండి 3 గంటల వరకు కేంద్రీయ విహార్‌ రోడ్డు, క్రికెట్‌ గ్రౌండ్‌, మయూరినగర్‌, రత్నదీప్‌ బ్యాక్‌సైడ్‌, విజేత సూపర్‌ మార్కెట్‌ ప్రాంతాలు, 3గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు మయూరినగర్‌ పార్ట్‌- 2 ఆర్‌ఎల్‌సిటీ, బాలాజీనగర్‌, వెంకటరాయనగర్‌, ఇంద్రమ్మ కాలనీ ఫేజ్‌-1, గోకరాజు, రంగరాజు కళాశాల ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదని తెలిపారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: మరమ్మత్తుల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ భాస్కర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటల నుంచి 11గంటల వరకు టీఎన్‌జీవోస్‌ కాలనీ, ఉదయం 11 గంటల నుంచి 11.30 గంటల వరకు సాయి ఐశ్వర్య కాలనీ, ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఏపీహెచ్‌బీ కాలనీ, జయభేరీ ఎన్‌క్లేవ్‌, మధ్యాహ్నం 1 గంట నుంచి 1.30 గంటల వరకు జీఎస్‌జీవోస్‌ కాలనీ, మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు రాయదుర్గం తదితర ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ


చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే గాంధీ శుక్రవారం పంపిణీ చేశారు. మాదాపూర్‌ డివిజన్‌ పరిధిలోని గోకుల్‌ ప్లాట్స్‌కు చెందిన నాంచారమ్మకు రూ.60 వేలు, కొండాపూర్‌ డివిజన్‌ సిద్ధిఖీనగర్‌కు చెందిన మణికి రూ.60 వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రగడ్ల శ్రీనివాస్‌ యాదవ్‌, రాజేందర్‌, శ్రీధర్‌రెడ్డి, మనోజ్‌, వెంకటేశ్వర్‌రెడ్డి, దేవా, హరిప్రకాష్‌ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌ వేతనాలు చెల్లించాలంటూ ధర్నా


ఈఎస్‌ఐ ఆసుపత్రి ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని ఈఎస్‌ఐ ఆసుపత్రిలో పనిచేసే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్‌ కార్మికులకు వెంటనే పెండింగ్‌ వేతనాలు చెల్లించాలని డిమాండ్‌ చేస్తూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆసుపత్రి ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ 4 నెలలుగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్‌ కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈవిషయంలో జిల్లా కలెక్టర్‌, మంత్రి జోక్యం చేసుకోవాలని కోరారు. సోమవారం నాటికి వేతనాలు ఇవ్వని పక్షంలో విధులను బహిష్కరిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్‌, యాదయ్య, సాయిలు, సంతోష, హంసమ్మ, పోచమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

28న నిధి ఆప్‌కే నిఖత్‌

పటాన్‌చెరు టౌన్‌: భవిష్యనిధి సంస్థ ద్వారా సమస్యల పరిష్కారానికి ఈ నెల 28 న నిధి ఆప్‌కే నిఖత్‌ 2.0 నిర్వహించనున్నట్లు ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్‌ విశాల్‌ అగర్వాల్‌ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...28 వ తేదీ ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5:45 గంటల వరకు 3 కేంద్రాలు పని చేస్తాయని తెలిపారు. రంగారెడ్డి జిల్లా...నిజాంపేట్‌లో విజ్ఞాన్‌ విద్యాలయ లిమిటెడ్‌, సంగారెడ్డి జిల్లా.. ఐడీఏ బొల్లారం సెంచరీ ఫైబర్‌ ప్లేట్స్‌ ప్రైవేటు లిమిటెడ్‌, పటాన్‌చెరు మండలం పాశమైలారం జెన్సింత్‌ ప్రయోగశాలలో శిబిరాలు ఉంటాయని, భవిష్యనిధి సమస్యలు ఉన్న వారు ఈ కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

వైభవంగా అష్టోత్తర శత కలశాభిషేకం



చందానగర్‌: చందానగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడవ రోజు శుక్రవారం ఉదయం 7.30 గంటలకు అష్టోత్తర శత కలశాభిషేకం, 10.30 గంటలకు సామూహిక లక్ష కుంకుమార్చన, మధ్యాహ్నం 12 గంటలకు హారతి, తీర్థప్రసాదములు, సాయంత్రం 6.30 గంటలకు ఐశ్వర్య లక్ష్మీహోమం, మహదాశీర్వచనము సింహవాహన సేవ నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


వీరబాబు (ఫైల్‌)

చందానగర్‌: వాహనం ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లా పెద్దాపురం మండలం చదలడ గ్రామానికి చెందిన మోటుకూరి వీరబాబు (40) పది సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం నగరంలోని మదీనాగూడ దీప్తిశ్రీనగర్‌కు వచ్చి వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 1 గంటకు భోజనం చేసి పని ఉందని భార్య సుబ్బలక్ష్మికి చెప్పి బయటకు వెళ్ళాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో భర్త కోసం పలుచోట్ల వెదికింది. 25వ తేదీన ఉదయం 6 గంటలకు చందానగర్‌ పోలీసులు వీరబాబు భార్య సుబ్బలక్ష్మికి ఫోన్‌ చేసి విషయం తెలియజేశారు. 24 అర్ధరాత్రి పీజేఆర్‌ ఎన్‌క్లేవ్‌ రోడ్డు వద్ద ఉన్న ఫుట్‌ఓవర్‌ బ్రిడ్జి కింద మియాపూర్‌ నుంచి చందానగర్‌ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వీరబాబును ఢీకొట్టిందని తెలిపారు. చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కనువిందు.. నృత్య ప్రదర్శనలు



మాదాపూర్‌: శిల్పారామంలో శుక్రవారం గీతికా కూచిపూడి డ్యాన్స్‌ అకాడమీ నాట్య గురువు లక్ష్మి అనంతకృష్ణ శిష్యబృందం నృత్యప్రదర్శన కనువిందు చేసింది. శ్రీ విఘ్నరాజంభజే, గణేశస్తుతి, గణేశకౌతం, అన్నమాచార్య కీర్తనలు, జతిస్వరం , తిల్లాన, శివస్తుతి, సరస్వతి స్తుతి, చంద్రచూడ, తిల్లాన, దశావతారం తదితర అంశాలను కళాకారులు శరణ్య, మహతి, జ్ఞానశ్రీ, సంకీర్తన, యోజన, దేవంశీ, తేజస్వీని, నయనికా, తనుశ్రీ, మోక్షిత, పూజ్యనందనా, లాస్య, కేశవరాణి, భవిష్యసాయి, గౌతమి, సిరిచందన, తర్లిక, అరుణ, శాన్వి, రేణుక తదితరులు ప్రదర్శించారు.



29న ధర్మయుద్ధ మహాసభ

రాయదుర్గం: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎంఆర్‌పీఎస్‌ ధర్మయుద్ధ మహాసభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్‌ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్‌ గణేష్‌ మాదిగ కోరారు. గచ్చిబౌలి డివిజన్‌ ఖాజాగూడలో ఎంఆర్‌పీఎస్‌ ముఖ్య నాయకులతో రౌండ్‌ టేబుల్‌ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంఆర్‌పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు 'హలో మాదిగ....చలో తుక్కుగూడ' పేరిట ఈనెల 29న ధర్మయుద్ధ మహాసభను జరుగుతుందని, ప్రతి మాదిగ విద్యార్థి, నాయకుడు, కార్యకర్త విధిగా పాల్గొని మాదిగల సత్తా నిరూపించాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్‌ నాయకులు రాజేష్‌, సుధాకర్‌, విన్నూ, అరుణ్‌ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ పనులు పరిశీలన


వివేకానందనగర్‌లో డివైడర్‌ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్‌ డివిజన్‌ పరిధిలోని వివేకానందనగర్‌ కాలనీ కమాన్‌ నుంచి కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపడుతున్న రోడ్డు డివైడర్‌ పనులను గురువారం అర్ధరాత్రి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ట్రాఫిక్‌ దృష్ట్యా ప్రజలకు ఇబ్బంది లేకుండా డివైడర్‌ను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌యంసీ వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ గురువారెడ్డి, రామకృష్ణ నగర్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ అధ్యక్షులు పురంధర్‌ రెడ్డి, కాలనీవాసులు ప్రసాద్‌, మాధవ్‌, నిఖిల్‌ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు సకాలంలో పూర్తి చేయాలి

పటాన్‌చెరు టౌన్‌: సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటిస్తూ, సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి సూచించారు. శుక్రవారం పటాన్‌చెరు మార్కెట్‌రోడ్‌లో రెండు కోట్లు జీహెచ్‌ఎంసీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్‌ మెట్టుకుమార్‌ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ నరేందర్‌, ఏఈ సురేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని పీజేఆర్‌ నగర్‌ కాలనీలో పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణ పనులను శుక్రవారం డివిజన్‌ కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ డివిజన్‌ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాస్‌, రవి, షౌకత్‌ అలీ, అగ్రవాసు, మహేష్‌, నాగయ్య గౌడ్‌, సౌందర్య, వాలి నాగేశ్వరరావు, మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.


ఆలయ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ వెంకటేష్‌గౌడ్‌ తదితరులు

గచ్చిబౌలి డివిజన్‌ అభివృద్ధే లక్ష్యం

కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి


గాలిదొడ్డిలో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి, స్థానికులు

రాయదుర్గం: ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడతామని గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌ గాలిదొడ్డిలో రూ.49.55 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన స్థానికులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గచ్చిబౌలి డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. కాలనీ, బస్తీలోని అంతర్గత రోడ్లను దశలవారీగా సీసీ రోడ్లుగా మారుస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్‌ నాయకులు తిరుపతి, భిక్షపతి, ప్రసాద్‌, సునీల్‌, ముర్గప్రసాద్‌, శ్రీనివాస్‌, రాజు,గోవింద్‌, యాదయ్య, వర్క్‌ఇన్‌స్పెక్టర్‌ లక్ష్మణ్‌, స్థానికులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో పోలింగ్‌ ప్రశాంతం

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో విద్యార్థి సంఘం-2024, 25 ఎన్నికల పోలింగ్‌ ప్రశాంతంగా జరిగింది. శుక్రవారం హెచ్‌సీయూ క్యాంపస్‌లో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నిక నిర్వహించారు. క్యాంపస్‌ మొత్తంలో 12 పోలింగ్‌ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్‌ సరళిని రిజిస్ట్రార్‌ డాక్టర్‌ దేవేష్‌నిగమ్‌, ఎన్నికల సంఘం చైర్‌పర్సన్‌ ప్రొఫెసర్‌ పద్మ, డీఎస్‌డబ్ల్యూ ప్రొఫెసర్‌ శ్రీనివాస రావు, ఇతర ఎన్నికల అధికారులు పర్యవేక్షించారు. 77.96 శాతం పోలింగ్‌ జరిగింది. ఎస్‌ఎఫ్‌ఐ, ఏఎస్‌ఏ, బీఎస్‌ఎఫ్‌, డీఎస్‌యూ ఒక కూటమిగా, ఏబీవీపీ-ఎస్‌ఎల్‌విడి కలిసి మరో కూటమిగా,ఎన్‌ఎస్‌యూఐ, ఏఐఎస్‌ఏ, ఎంఎస్‌ఎఫ్‌ ఇంకో కూటమి,ఏఐఓబీసీఎస్‌ఏ, టీఎస్‌ఎఫ్‌, వైఐఎస్‌ఎస్‌ మరో కూటమి, 3 విద్యార్థి సంఘాలు కలిపి మరో కూటమిగా బరిలో నిలిచాయి.


ఓటు వేస్తున్న విద్యార్థులు

'కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నారు'


మాట్లాడుతున్న రవి

మియాపూర్‌: రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం కార్పొరేట్‌ పెట్టుబడిదారీ వర్గాలకు కొమ్ముకాస్తోందని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్‌ గాదగోని రవి విమర్శించారు. శుక్రవారం మియాపూర్‌ ఎంఏనగర్‌లోని ఎంసీపీఐయూ గ్రేటర్‌ హైదరాబాద్‌ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలు కార్పొరేట్‌ పెట్టుబడిదారులకు అనుకూలంగా, కులమత తత్వాలు మరింత బలపడేవిధంగా ఉన్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు దానయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్‌, గ్రేటర్‌ హైదరాబాద్‌ కమిటీ కార్యదర్శి మైదంశెట్టి రమేష్‌, సహాయ కార్యదర్శి అనిల్‌కుమార్‌, కార్యవర్గ సభ్యులు సుకన్య, తుకారాంనాయక్‌, దశరథ్‌ నాయక్‌, అంగడి పుష్ప, తాండ్ర కళావతి తదితరులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే


ధాన్యం కొనుగోలు కేంద్రంను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి

పటాన్‌చెరు: రైతు సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం ముత్తంగి, పటాన్‌చెరు పట్టణంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సన్న వడ్లకు మద్దతు ధరకు అదనంగా 500 రూపాయల బోనస్‌ అందించడం జరుగుతుందని తెలిపారు. ఏ వన్‌ గ్రేడ్‌ క్వింటాలుకు రూ.2,320, సన్న వడ్లకు క్వింటాలుకు 2,820 రూపాయలు మద్దతు ధర అందిస్తుందని తెలిపారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలని కోరారు. పటాన్‌చెరు నియోజకవర్గ వ్యాప్తంగా 10 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్‌ ఛైర్మన్లు రాఘవేంద్రారెడ్డి, బిక్షపతి, కాంగ్రెస్‌ పార్టీ పటాన్‌చెరు పట్టణ అధ్యక్షులు నర్సింహారెడ్డి, డైరెక్టర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నాలాలను విస్తరించకుండా వరదనీటి మళ్లింపా..?

బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్‌ రవికుమార్‌యాదవ్‌


రవికుమార్‌యాదవ్‌కు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద నాలాలను విస్తరించకుండా వరద నీటిని ఎలా మళ్ళిస్తారని బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్‌ రవికుమార్‌ యాదవ్‌ జీహెచ్‌ఎంసీ అధికారులను ప్రశ్నించారు. శుక్రవారం ఆయన లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్‌ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయన్ని కలిసి సమస్య పరిష్కరించాలంటూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌, కృష్ణారెడ్డి, సుదర్శన్‌రావు, వెంకటేశ్వరరావు, సోమయ్య యాదవ్‌, కిషోర్‌, శ్రీను, నరసింహయాదవ్‌, కృష్ణ, విజయ్‌ పాల్గొన్నారు.

టీఎన్‌జీవోస్‌ కాలనీలో హాస్టళ్లు వద్దంటూ నిరసన

కమర్షియల్‌ భవనాలపై చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీకి స్థానికుల ఫిర్యాదు


టీఎన్‌జీవోస్‌ ఫేజ్‌-2లో హాస్టళ్లు వద్దంటూ నిరసన తెలుపుతున్న స్థానికులు



హాస్టళ్లను అనుమతించబోమంటూ టీఎన్‌జీవోస్‌ ఫేజ్‌-2 రోడ్డు నంబర్‌ 39లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

గచ్చిబౌలి: టీఎన్‌జీవోస్‌ (తెలంగాణ నాన్‌ గెజిటెడ్‌ ఆఫీసర్స్‌) కాలనీలో అక్రమంగా నిర్మించిన భవనాల్లో పీజీ హాస్టళ్లు, గెస్ట్‌ హౌస్‌లు ఏర్పాటు చేస్తున్నారని కాలనీ వాసులు గురువారం రాత్రి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. టీఎన్‌జీవోస్‌ ఫేజ్‌-2లోని వీధి నంబర్‌ 9, 39లో హాస్టళ్లు, గెస్ట్‌ హౌస్‌లను అనుమతించబోమని స్థానికులు స్పష్టం చేశారు. 9వ వీధిలో 28 ప్లాట్లు ఉండగా కొందరు అనుమతికి మించి బహుళ అంతస్తులను నిర్మించి రెసిడెన్షియల్‌ కాలనీలో వ్యాపారం నిర్వహిస్తున్నారని దుయ్యబట్టారు. ప్లాట్‌ నంబర్‌ 216లో హాస్టల్‌ను తెరిచేందుకు సిద్ధంగా ఉన్నారని, దాదాపు 50 మంది హాస్టల్స్‌ ఏర్పాటు చేశారని శేరిలింగంపల్లి సర్కిల్‌ ఉప కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. 167 చదరపు గజాల విస్తీర్ణంలో జీ ప్లస్‌ ఐదు అంతస్తుల భవనాలు వెలిశాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఒక్కో హాస్టల్‌లో దాదాపు 100 మంది ఉంటారని వసతులు సరిపోవని చెప్పారు. ఈ నెల 21న ఫిర్యాదు చేసినా జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకో లేదని వాపోయారు.